# ముని - తేలు



అనగనగా ఒక ఊర్లో ఒక గురువుగారు ఉండేవారు . ఒక రోజు ఆయన తన శిష్యులతో పాటు కలిసి నదికి స్నానం చేద్దామని వెళ్ళారు. నదిలో స్నానం చేసి తిరిగి ఒడ్డుకు వెళ్తూ ఉండగా, గురువుగారికి నదిలో ఒక కొమ్మ కొట్టుకుపోతూ కనపడింది.

ఆ కొమ్మ మీద ఒక తేలు ప్రాణభయంతో అటూ ఇటూ పరుగులు తీస్తూ ఉండటం మన గురువుగారు చూసారు. అయ్యో అని, గబుక్కున ఆ కొమ్మ మీద ఉన్న తేలుని తన చేతిలో తీసుకుని ఒడ్డు మీద వదిలేద్దాము అని బయలుదేరారు. శిష్యులేమో ముందే వెళ్ళిపోయి ఒడ్డు మీద నిలబడి ఇది అంతా చూస్తూ ఉన్నారు.

సరే మన గురువు గారు బయలుదేరగానే చేతిలో ఉన్న తేలు కుట్టింది. భరించరాని నొప్పిగా ఉన్నా గురువుగారు ఆ తేలుని వదలలేదు. ఇంకొంచెంసేపు అయ్యాక తేలు మళ్ళీ రెండోసారి కుట్టింది.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఈ సారి కూడ , తనకి ఎంత నొప్పిగా ఉన్నా తేలుని వదిలిపెట్టలేదు మన గురువుగారు.ఇంకొ పది అడుగుల్లో ఒడ్డు ఉందనగా తేలు మళ్ళీ కుట్టింది. గురువు గారు నొప్పి తట్టుకోలేక కింద పడిపోయారు. కాని తేలుని మటుకు చేతిలోనుంచి వదిలిపెట్టలేదు. సరే అలానే నెమ్మదిగా లేచి, ఒడ్డుకి వచ్చి తేలుని అక్కడున్న పొదల్లో ఒదిలి పెట్టి సంతోషంగా ఒక చిరునవ్వు నవ్వారు, అంత బాధలో కూడా.

అప్పుడు ఇది అంతా చూస్తూ ఉన్న శిష్యబృందం వచ్చి" అయ్యా, గురువు గారు, మిమ్మల్ని ఆ తేలు అన్ని సార్లు కుట్టినా కూడా చేతిలో నుంచి పారవెయ్యకుండా ఒడ్డుకి ఎందుకు తీసుకుని వచ్చారు. ఇంత బాధలో కూడా అంత సంతోషంగా ఎలా ఉన్నారు " అని అడిగారు.

అప్పుడు గురువుగారు ఏం చెప్పారో తెలుసా ?

"శిష్యా..అది తేలు..దాని ధర్మము కుట్టటం కాబట్టి అది కుట్టింది. నా ధర్మం ఇతర జీవుల్ని రక్షించడం కాబట్టి నేను రక్షించాను.అందువలన ఎవరి ధర్మం వారు పాటిస్తే అందరూ సంతోషంగా ఉండవచ్చు" అని చెప్పారు.

**అదీ పిల్లలూ, మరి ఎవరి ధర్మం వాళ్ళు పాటిస్తే అందరూ సంతోషంగా ఉండవచ్చు అన్న మాట.**

**Keywords: Muni Telu katha, Telugu lO china pillala kathalu, Neeti Kathalu , Telu Dharmam, Muni Dharmam**

**www.maganti.org**
**Vamsi M Maganti**
**contact@maganti.org**



PDF created with pdfFactory trial version www.pdffactory.com